# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 27 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఒడిశా గంజాయి లేడీ డాన్ అరెస్టు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఒడిశా గంజాయి లేడీ డాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణలో ఐదు కేసుల్లో నిందితురాలిగా ఉన్న సంగీతా సాహును అరెస్టు చేయడానికి ప్రత్యేక టీమ్‌ను ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసస్ రెడ్డి ఒడిశాకు పంపించారు. నంద్యాల అంజి రెడ్డి పర్యవేక్షణలో తెలంగాణ నుంచి వేయి కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిశాకు కాళీకోట్ వెళ్లిన ఎస్‌టిఎఫ్‌సి పంపిన టీమ్ స్థానిక పోలీసుల సహకారం తీసుకొని సంగీతా సాహును అరెస్టు చేసి తీసుకొచ్చారు. సంగీతా సాహును అరెస్టు చేయడానికి ఒడిశాకు వెళ్లిన టీమ్‌లో ఎస్ఐ సైదులు, హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీధర్, కానిస్టేబుళ్లు మహేష్, అరుణ్, మంగలు ఉన్నారు. గంజాయి లేడీ డాన్ సంగీతా సాహును ఒడిశాకు వెళ్లి అరెస్టు చేసి తీసుక వచ్చిన టీమ్‌ను ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు. గంజాయి లేడీ డాన్ సంగీతా సాహు ఇన్‌స్టా గ్రామ్‌లో సినీ హీరోయిన్‌లా వీడియోలు పోస్టు చేస్తుంది. గంజాయి వినియోగం ఎక్కడ ఉంటే అక్కడి వెళ్లి గంజాయి వ్యాపారులతో ఒప్పందాలు కుదుర్చుకుంటుంది సంగీతా సాహు అలియాస్ గీతా సాహు. ఒడిశాలోని కుర్ధా జిల్లా కాళీకోట్ గ్రామానికి చెందిన సంగీతా సాహు గత నాలుగు సంవత్సరాల నుంచి హెూల్‌సేల్ గంజాయి వ్యాపారం లోకి దిగింది. భువనేశ్వర్‌కు దగ్గరగా ఉండడంతో అనేక రాష్ట్రాల గంజాయి వ్యాపారులతో మాట్లాడుతూ వారికి గంజాయిని సరఫరా చేస్తు ఉంటుంది.

# బెట్టింగ్ యాప్‌లపై సిట్

- వ్యసనాలకు తెలంగాణలో తావులేదు
- శాంతి భద్రతలు బాగుంటేనే పెట్టుబడులు
- ఉప ఎన్నికలు వస్తాయనేది పచ్చి అబద్ధం
- ప్రతిపక్షాలు సామాజిక బాధ్యతతో మాట్లాడాలి
- చేసేదే చెబుతాం.. చెప్పిందే చేస్తాం :
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రత్యక్షంగా నిర్వహించినా, పరోక్షంగా ప్రోత్సహించినా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇలాంటి వాటిని నిరోధించడానికి, నిషేధించడానికి పూర్తి స్థాయి అధికారాలతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సభ్యుల నుంచి వచ్చిన ప్రస్తావనపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని, ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్, ఆన్‌లైన్ రమ్మీ వంటి వాటి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

"కేవలం ప్రచారం కల్పించే వారిని విచారించడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. ఈ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల వల్ల ఎంతో మంది బలవుతున్నారు. కేవలం రాష్ట్రంలో చర్యలు తీసుకున్నంత మాత్రాన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. ఇతర రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల నుంచి ఆపరేట్ చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి. వీటిని నిషేధిస్తూ 2017 లో చట్టం చేసినప్పటికీ పకడ్బందీగా అమలు చేయడంలో కొంత నిర్లక్ష్యం జరిగింది. ఈ మధ్య కాలంలో చాలా వేగంగా దుర్వినియోగం జరుగుతోంది. రాష్ట్ర స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు వివిధ రకాల సంస్థలు, వ్యక్తులు, వివిధ దేశాలకు చెందిన నేరగాళ్లు ఇందులో పాల్గొంటున్నారు.ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులకు చట్టంలో కఠినమైన శిక్షలు కూడా లేవు. శిక్షను పెంచుతూ చట్టంలో అవసరమైన మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్, ఆన్ లైన్ రమ్మీ మాత్రమే కాదు. గంజాయి, కొకైన్, కోడి పందాల్లాంటి ఇతర వ్యసనాలకు కూడా తెలంగాణలో తావులేదు.

తెలంగాణను ఒక ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నాం. ధరల నియంత్రణలో, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో తెలంగాణ ముందున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తామెక్కడా డాంబికాలకు గొప్పలకు పోకుండా వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టే విధంగా రూపొందించాం. చేసేదే చెప్పాం. చెప్పిందే చేస్తామన్న విధానంలో బడ్జెట్‌ను నియంత్రించాం. గచ్చిబౌలిలోని భూమి సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోనిది కాదు. యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేదు. గతంలో ఐఎంజీ భారత్ అనే ఒక బోగస్ కంపెనీకి కేటాయించిన భూమిని 2006 లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దాదాపు 25 సంవత్సరాల పాటు న్యాయస్థానాల్లో కేసు పెండింగ్‌లో ఉంది. గత ప్రభుత్వంలో ఆ భూమిని వెనక్కి తిరిగి తీసుకోవాలన్న ప్రయత్నాలు చేయలేదు.

తాను అధికారం చేపట్టిన తర్వాత సుప్రీంకోర్టులో పోరాడి ఆ కేసు గెలిచి భూమిని వెనక్కి తీసుకున్నాం. అభివృద్ధిలో భాగంగా ఆ భూమిని టీజీఐఐసీకి కేటాయించాం. అక్కడ ఐటీ కంపెనీలు, ఇతర పరిశ్రమలు రావడానికి ఒక స్పష్టమైన ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ప్రణాళిక తయారు చేయమన్నాం. రకరకాల ప్రచారాలు చేస్తున్నట్టు అది రిజర్వు ఫారెస్ట్ కాదు.కాలుష్య కారక ఫార్మా పరిశ్రమలను కాదని, నెట్ జీరో సిటీ చేయాలన్న ఒక మంచి సంకల్పంతో 4 కోట్ల తెలంగాణ ప్రజల కోసం ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. పరిశ్రమల ఏర్పాటు, ఇతరత్రా భూసేకరణకు సంబంధించి భూమి కోల్పోతున్న వారి బాధను దృష్టిలో ఉంచుకొని వారికి ఏ రకంగా నష్టపరిహారం చెల్లిద్దామన్న విషయంలో సూచనలు ఇవ్వాలి. భూములను కోల్పోతున్న వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిది. అలాంటి కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిద్దాం" అని ముఖ్యమంత్రి గారు వివరించారు.

**విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాలి**

విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి ఆ రంగంలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ దీన్ని ఒక సామాజిక బాధ్యతగా గుర్తించినప్పుడే వ్యవస్థలో అవసరమైన ప్రక్షాళన చేయడం సాధ్యపడుతుందని చెప్పారు. విద్యా రంగంపై శాసనమండలిలో జరిగిన ప్రత్యేక చర్చకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. 2021 నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో పేర్కొన్న గణాంకాలను సభలో వివరించారు. సబ్జెక్టుల వారిగా తెలంగాణలో ఏ స్థానానికి పడిపోయిందీ తెలిపారు. ఏ సబ్జెక్టులోనూ కనీస ప్రాథమిక సామర్థ్యాన్ని ప్రదర్శించలేని వారి సంఖ్య పెరగడం, ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య తగ్గడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

"విద్యా విధానం కొంత ఆందోళనకరంగా మారింది. ఎవరు అవునన్నా కాదన్నా ఇందులో వాస్తవం ఉంది. విద్యా రంగంలో పడిపోతున్న ప్రమాణాలను పెంచాలంటే కేవలం నిధుల కేటాయింపు ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదు. అందరూ ఒక సామాజిక బాధ్యతగా భావించినప్పుడే సమస్యను పరిష్కరించగలుగుతాం.విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు, ప్రక్షాళన చేయడానికి సూచనలు, సలహాలు ఇవ్వండి. అందరి సూచనలతో సమగ్రమైన ఒక పాలసీ డాక్యుమెంట్‌ను రూపొందించి చర్చిద్దాం. పడిపోతున్న ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికీ మేల్కొనకపోతే భవిష్యత్తు తరాలకు మనం ద్రోహం చేసిన వారిమవుతాం. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ ప్రక్షాళన చేయలేం. విద్యా రంగంలో ప్రమాణాలు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అధికారంలోకి రాగానే, డీఎస్సీ నిర్వహించి 10 వేల మంది టీచర్ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలు, ప్రమోషన్లను పూర్తి చేశాం. అయితే, విద్యా ప్రమాణాలు పడిపోవడంలో కేవలం ప్రభుత్వానిదే కాకుండా సమాజంపైన కూడా బాధ్యత ఉంది. సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచాల్సిన అవసరం ఉంది. రాజకీయ కోణంలో ఆలోచనలు చేసినన్ని రోజులు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయలేం. యువతలో నైపుణ్యం కొరవడి వెనుకబడిపోతున్నారు. నైపుణ్యతలను పెంచడానికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (చ%క్కీ్మాఖ%) ని ఏర్పాటు చేశాం. అలాగే, మూస పద్ధతిలో సాగుతున్న ఐటీఐలను సంస్కరిస్తూ కాలం చెల్లిన కోర్సులకు స్వస్తి పలుకుతూ వాటిని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా (చ%ూుజ%) అప్‌గ్రేడ్ చేస్తున్నాం. వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నాం. క్రీడాకారులను తయారు చేయడం, ఒలింపిక్స్ క్రీడలు లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీలను ప్రారంభించబోతున్నాం. దీనికి సంబంధించి త్వరలోనే విధివిధానాలను ప్రకటిస్తాం. కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం" అని వివరించారు.

# ఏప్రిల్‌లో కొత్త రేషన్‌కార్డుల జారీ

- ఉగాది నుంచి తెల్ల రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెల్ల రేషన్ కార్డు దారులకు ఉగాది నుంచి సన్న బియ్యం ఇవ్వనున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలి పారు. బుధవారం శాసనసభలో జరిగిన వివిధ శాఖల పద్దులపై చర్చ సందర్భంగా మంత్రి సమాధానమిస్తూ.. రాష్ట్రంలో 89.1 లక్షల రేషన్ కార్డులకు ఏటా 24లక్షల మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అదిస్తున్నామని చెప్పారు. అయితే ఆ బియ్యం పక్కదారి పడుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రంలోని తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లో ప్రతి ఒక్కరికీ 6 కిలోల సన్న బియ్యాన్ని అందించనున్నామని చెప్పారు. రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి ఆహార భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. బియ్యంతో పాటు త్వరలో ఇతర నిత్యావసర వస్తువులను కూడా చౌకధరల దుకాణాల ద్వారా అందించనున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికి ఏప్రిల్ నుంచి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. భౌతికంగా కార్డుల జారీలో ఆలస్యమైనా పోర్టల్‌లో పేరున్న వారికి సన్న బియ్యాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. రేషన్‌కార్డు ఉన్న వారు రాష్ట్రంలో ఎక్కడైనా సరుకులు తీసుకునే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. నీటి పారుదల ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌లో పెట్టిన నిధుల్లోంచి సగం వరకు గత ప్రాజెక్టులకు తెచ్చిన అప్పులు, వాటి వడ్డీలు చెల్లించేందుకే వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను ప్రభుత్వం సమ దృష్టితో చూస్తోందని తెలిపారు. నిధుల కేటాయింపులో ప్రాంతాల వారీగా ఎలాంటి వివక్షను పాటించడం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని అన్నారు. డీపీఆర్‌లో షీట్ పైల్స్ ఉంటే.. నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారని చెప్పారు. కాళేశ్వరం తప్పిదాలకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం దురదృష్టకరమనీ, బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామన్నారు. తక్కువ ఖర్చుతో త్వరితగతిన ఎక్కువ ఆయకట్టుకు నీరిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు



## తెలంగాణ ప్రభుత్వంతో సిస్కో కీలక ఒప్పందం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

టెక్నాలజీ రంగంలో దిగ్గజం అయిన సిస్కో, తెలంగాణలోని ప్రతిష్టాత్మక యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కలిసి నైపుణ్య శిక్షణను అందించనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో స్కిల్స్ యూనివర్సిటీ, సిస్కో మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. అసెంబ్లీ కమిటీ హాలులో ముఖ్యమంత్రితో పాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇతర ఉన్నతాధికారులు, సిస్కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గయ్ డీడ్రిక్ గై డ్రైడ్రిచ్, ఆ సంస్థ ఇతర ప్రతినిధులతో కీలక సమావేశం జరిగింది. నైపుణ్య శిక్షణ అందించే విషయంలో ఈ సందర్భంగా సిస్కోకు స్కిల్స్ యూనివర్సిటీకి, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ TASKకు మధ్య వేర్వేరు ఒప్పందాలు కుదిరాయి. ఈ సమావేశంలో స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు గారు, టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా పాల్గొన్నారు.

# కమీషన్ వ్యాఖ్యల దుమారం

- 30 శాతం పర్సంటేజీల ప్రభుత్వం : కేటీఆర్
- ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి : భట్టి
- కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నాం : ప్యానల్ స్పీకర్ రేవూరి
- సభ నుంచి వాకౌట్ చేసిన బీఆర్ఎస్ సభ్యులు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన 'కమీషన్' వ్యాఖ్యలు తెలంగాణ అసెంబ్లీలో దుమారం రేపాయి. కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ వ్యాఖ్యలపై మండిపడ్డ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'మైకు చేతిలో ఉందికదా అని ఇష్టమొచ్చినట్టు మాట్లాడొద్దు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి. ఆధారాలతో చూపించు.. లేకుంటే సభకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పు' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భావోద్వేగ హెచ్చరికతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ క్రమంలో భట్టి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఆందోళనకు దిగడంతో సభలో గందరగోళం నెలకొంది. చివరకు కేటీఆర్ వ్యాఖ్యలను ప్యానెల్ స్పీకర్ రికార్డుల నుంచి తొలగించడంతో నిరసనగా బీఆర్ఎస్ వాకౌట్ చేసి అసెంబ్లీ బయట నిరసనలు కొనసాగించింది.

బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్ మాట్లాడుతూ..'సభలో విశేష అనుభవమున్న, ఉన్నత పదవులను అలంకరించిన మిమ్మల్ని అడుగుతున్నా. రికార్డులు తెప్పించండి. మంత్రులు అన్ని సార్లు జోక్యం చేసుకోవడమేంటి అధ్యక్షా. ఎసెన్స్ ఆఫ్ డెమొక్రసీ సార్. కాంగ్రెస్ నుంచి 53 మంది కొత్త సభ్యులున్నారు. డిస్కర్షన్, డిబేట్, డిసెంట్ ఉండాలి. ప్రతిపక్షంగా ప్రభుత్వం చేస్తామని చేయని వాటిని ఎత్తిచూపుతాం. అలవుగాని హామీల గురించి అడుగుతాం. మంత్రులకు దయచేసి చెప్పండి. ఎక్కువ ఇన్వాల్వ్ కావొద్దని చెప్పండి. చెప్పాలనుకుంటే మేం కూడా చెప్పొచ్చు. 30 శాతం కమీషన్ సర్కారు అని వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నరు. 20 శాతం కమీషన్ అడుగుతున్నారని కాంట్రాక్టర్లు సచివాలయంలోనే ధర్నాలు చేస్తున్నారు' అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులంతా లేచి ముందుకొచ్చారు.

30 శాతం కమీషన్లు ఎక్కడ తీసుకున్నామో కేటీఆర్ నిరూపించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. లేదంటే రాష్ట్ర ప్రజలకు, సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాము బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చామనీ, తాడితపీడిత, అణగారిన వర్గాల వారి పక్షాన నిలబడ్డామని చెప్పారు. 'మీలాగా రాష్ట్రంపై పడి అడ్డగోలుగా దోచుకోలేదు. మీరు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. సభ్యులు మాట్లాడేటప్పుడు నిబద్ధతతో, ఒళ్ళు దగ్గర పెట్టుకునే మాట్లాడాలి. మైకు దొరికింది గదా అని ఏది పడితే అది మాట్లాడితే చెల్లుబాటు అవుతుంది అనుకుంటున్నారా?' అంటూ ప్రశ్నించారు. మాట్లాడే ప్రతి మాట జాగ్రత్తగా ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. డిస్కర్షన్, డిబేట్ అంటూనే ప్రతిమాటా అబద్ధం చెబితే ఎలా అని నిలదీశారు. '40,000 కోట్ల పనులకు సంబంధించిన బిల్లులు మీరు పెండింగ్లో పెట్టి పోయారు, మీ పాపం వల్ల మొత్తం లక్ష కోట్ల బిల్లులు పెండింగ్లో పడ్డాయి. పనులు చేసిన వాళ్లు బిల్లులు రాక సచివాలయం చుట్టూ రోజూ తిరుగుతున్నారు. దానిపైనా అసత్య ప్రచారం చేయడం తగదు' అన్నారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పేరిట అడ్డ గోలుగా ప్రకటనలు ఇచ్చామని అబద్ధాలు మాట్లాడితే ఎలా? అని ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి సివిల్ సర్వీస్ పరీక్షల్లో ప్రిలిమ్స్ పాసై దరఖాస్తు చేసుకున్న పేదలకు లక్ష రూపాయల సహాయం, మెయిన్స్ అర్హత సాధించి ఢిల్లీలో ఇంటర్వ్యూలకు ప్రిపేర్ అయ్యే రాష్ట్ర అభ్యర్థులకు మరో లక్ష రూపాయలు ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించామన్నారు. వారు సివిల్స్ సర్వీసులో ఉంటే భవిష్యత్తులో రాష్ట్రానికి మేలు చేసే అవకాశం ఉంటుంది కదా? రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతారు కదా? ఇలాంటి మంచి పథకం మీద అలా మాట్లాడటం తగదని హెచ్చరించారు. కేటీఆర్ వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. ఇతర సభ్యుల మాటల్లోనూ అన్‌పార్లమెంట్ పదాలుంటే తొలగిస్తామని హామీనిచ్చారు. బీఆర్ఎస్ సభ్యులు '30 శాతం కమీషన్ సర్కార్ డౌన్ డౌన్...30 శాతం కమీషన్ సర్కార్ డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేసుకుంటూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

## ఉప ఎన్నికలు రావు

- సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయని జోరుగా ప్రచారం చేస్తున్నారనీ, వీరు (బీఆర్ఎస్ నేతలు) హడావిడి చేసినంత మాత్రాన ఎన్నికలు రాబోవని సీఎం తేల్చి చెప్పారు. 2028లోనే ఎన్నికలొస్తాయని తెలిపారు. ఆనాడు పార్టీ మారిన వాళ్ల మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసినా.. ఉప ఎన్నికలు రాలేదని గుర్తు చేశారు. గతంలోనే రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని ప్రశ్నించారు. గతంలో ఆచరించిన సంప్రదాయాలనే ఇప్పుడూ ఆచరిస్తున్నామని తెలిపారు. సభ్యులెవరూ ఆందోళన చెందొద్దనీ, ఏ ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. తమ దృష్టి ఉప ఎన్నికలపై లేదనీ, రాష్ట్రాభివృద్ధిపైనే తమ ధ్యాసంతా ఉందని తెలిపారు. బీఆర్ఎస్‌లో కొందరి మధ్య ఉన్న పోటీ రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతోందని ఎద్దేవా చేశారు. 'మమ్మల్ని బదనాం చేసినంత మాత్రాన మీరు మంచి వారు కాలేరని చెప్పారు. తాము వివక్ష చూపబోమనీ, అది తమ విధానం కాదని తెలిపారు. డాంబికాలతో తమ ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశపెట్టలేదని స్పష్టం చేశారు. చేసేదే చెప్తాం.. చెప్పిందే చేస్తామన్నారు.



## శాసనమండలి ఆవరణలో బీఆర్ఎస్ నిరసన

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

శాసనమండలి ఆవరణలో బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆకస్మికంగా నిరసనకు దిగారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ప్లకార్డులు చేతబట్టుకుని నిరసన తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద తులం బంగారం ఇవ్వాలంటూ బంగారం కడ్డీల నమూనాలను ప్రదర్శిస్తూ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 నెలలుగా రాష్ట్రంలో కొత్తగా పెళ్లైన జంటలు తులం బంగారం కోసం ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్సీలు తెలిపారు. నిరుపేదలు ఆడబిడ్డ పెళ్లి చేసేందుకు ఇబ్బందులు పడకూడదనే కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.లక్షకుపైగా ఆర్థిక సాయం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ నేతలు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారనీ, అధికారంలోకి రాగానే ఆ హామీని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఖాతాల్లో జమ చేస్తామని మాయ మాటలు చెప్పారని విమర్శించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనీ, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ నిరసనలో శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్, వాణిదేవి, తాతా మధు, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభలో నాకు మైక్ ఇవ్వడం లేదు

- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పార్లమెంటు సమావేశాలు అప్రజాస్వామికంగా నడుస్తున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. లోక్‌సభలో మాట్లాడేందుకు తనకు కనీసం అవకాశం కూడా ఇవ్వడం లేదన్నారు. సభ గౌరవాన్ని కాపాడేందుకు సభ్యులు విధివిధానాలు పాటించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కోరిన తర్వాత రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. స్పీకర్ తనపై వ్యాఖ్యలు చేశారని, తనకు ప్రసంగించే అవకాశం ఇవ్వకుండానే సభను వాయిదా వేశారని రాహుల్ గాంధీ చెప్పారు. గతవారం కూడా ఇలానే తనను మాట్లాడనివ్వలేదని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు మాత్రం ఇది సరైన మార్గం కాదన్నారు. ఏం జరుగుతోందో తనకు తెలియడంలేదని, మాట్లాడేందుకు అనుమతి కోరినా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడికి సభలో ప్రసంగించే అవకాశం ఇవ్వడం సంప్రదాయమని గుర్తు చేశారు. బుధవారం లోక్‌సభ వాయిదా అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేతలతో సహా 70 మంది ఆ పార్టీ ఎంపీలు స్పీకర్‌ని కలిసి చర్చించినట్లు హస్తం పార్టీ వర్గాలు వెల్లడించాయి.

"నేను ఎప్పుడు లేచి నిలబడినా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదు. మేం చెప్పాలనుకొనే అంశాలను లేవనెత్తేందుకు మాకు అనుమతి ఇవ్వడంలేదు. నేనేమీ చేయలేదు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా కూర్చున్నా. ఏడెనిమిది రోజుల నుంచి నన్ను మాట్లాడేందుకు అనుమతించడం లేదు. ఇదో కొత్త ఎత్తుగడ. ప్రతిపక్షానికి ఇక్కడ చోటులేదు. ఇటీవల ప్రధాని కుంభమేళా గురించి మాట్లాడినప్పుడు నేను నిరుద్యోగం గురించి మాట్లాడాలనుకున్నా, కానీ మాట్లాడేందుకు అనుమతించలేదు. మమ్మల్ని మాట్లాడేందుకు అనుమతించకపోవడం అప్రజాస్వామికం" అని రాహుల్ గాంధీ అన్నారు.

## భద్రాచలంలో కుప్పకూలిన ఆరు అంతస్తుల భవనం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భద్రాచలంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలోపలువురు శిధిలాల కింద చిక్కుకున్నట్టు తెలుస్తోంది. రామాలయం లోని సలీం టీ స్టాల్ ఎదురుగా ఈ ఘటన జరిగినట్టు చెబుతున్నారు. ఈ దుర్ఘటనలో ఆరు అంతస్తుల భవనం పూర్తిగా కూలిపోగా.. నాణ్యత లోపంతో కూలినట్టుగా భావిస్తున్నారు. ప్రమాద సమయంలో అందులో పనిచేస్తున్న కూలీలు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సమీప ఇళ్లలోని ప్రజలు ప్రాణ భయంతో బయటికి పరుగులు తీశారు. పోలీసులు సహాయక చర్యలు కొనసాగుతుండగా.. భవనం కూలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి

## తెలంగాణ మున్సిపాల్టీస్ యాక్ట్ 2019 సవరణ బిల్లు ఆమోదం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నూతన మున్సిపాల్టీల ఏర్పాటు, గ్రామాల విలీనం, మార్పులు తదితర విషయాల్లో ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్నట్టు రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం శాసనమండలిలో తెలంగాణ మున్సిపాల్టీస్ యాక్ట్, 2019 సవరణ బిల్లును ఆమోదించారు. అంతకు ముందు జరిగిన చర్చకు మంత్రి సమాధానమిస్తూ, నేరుగా ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని చట్టంలో లేదనీ, అయితే వివిధ వినతిపత్రాల రూపంలో వచ్చిన ప్రజల అభిప్రాయాలను క్రోడీకరించి కలెక్టర్లు నివేదికలు ఇచ్చారని తెలిపారు. గ్రామాల విలీనం సమయంలో అక్కడి ప్రజలు ఉపాధి కోల్పోతుండటంతో ప్రత్యామ్నాయ ఉపాధి కోసం చర్యలు తీసుకోనున్నట్టు హామీ ఇచ్చారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం ఈ సవరణ తెస్తున్నట్టు తెలిపారు. నగరాభివద్ధి నిధుల ద్వారా ఆదుకోనున్నట్టు చెప్పారు. షెడ్యూల్ ప్రాంతంలో వచ్చే గ్రామాల హక్కులను పరిరక్షిస్తామన్నారు. పాల్వంచలో ఏజెన్సీ గ్రామాలను కలుపలేదని స్పష్టం చేశారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు అక్కడి మున్సిపాల్టీ పరిధిలో ఓటర్లని తెలిపారు. జీహెచ్ఎంసీలో విలీనమయ్యే వారు భయాందోళనకు గురి కావద్దని కోరారు. ప్రోటోకాల్‌కు సంబంధించి గత ప్రభుత్వంలో తాను కూడా బాధితున్నేననీ, ఆ బాధ తనకు తెలుసని చెప్పారు. మెప్మా రిసోర్స్ పర్సన్స్ వేతనాలను పెంచే విషయాన్ని పరిశీలించనున్నట్టు తెలిపారు.

# అసెంబ్లీలో ఎమ్మెల్యే వర్సెస్ మంత్రి

- **భూ భారతి, ధరణిలపై మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మధ్య వాదోపవాదనలు**



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ అసెంబ్లీలో బుధవారం ధరణి, భూ భారతిలపై బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వచ్చే ఎన్నికల్లో భూ భారతి కాన్సెప్ట్‌తో ప్రజల్లోకి వెళ్తామన్న మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అసత్యాన్ని సత్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. భూభారతిపై కాంగ్రెస్ ఎన్నికలకు వెళ్తే.. తాము కూడా ధరణిపైనే ఎన్నికలకు వెళ్తామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రెఫరెండం ఏం వస్తుందో చూద్దాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చింది భూ భారతి కాదు భూ హారతి అని విమర్శించారు. జమాబంది పేరుతో కాంగ్రెస్ మరో దుకాణం తెరిచిందని.. ఇప్పుడు జమాబంది ఎందుకో ప్రభుత్వం చెప్పాలని పల్లా డిమాండ్ చేశారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే వారిని ఓడించారని అన్నారు మంత్రి.

ఇక పల్లా రాజేశ్వర్‌రెడ్డి సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారంటూ అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. సాయుధ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ భూములపై హక్కులు కల్పిస్తూ వస్తోందని తెలిపారు. దున్నేవాడిదే భూమి కదా సాయుధ పోరాట నినాదం అని గుర్తుచేశారు. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టమే ధరణి అని ఆరోపించారు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని ఎన్నికల సమయంలో చెప్పామని.. చెప్పినట్లుగానే బంగాళాఖాతంలో వేశామని.. కొత్త చట్టం తెచ్చామని వెల్లడించారు.

**పోలీసులను రాజకీయాల్లోకి లాగొద్దు : మంత్రి పొన్నం**

తెలంగాణ అసెంబ్లీలో ఎంఎంటీఎస్ ఘటనపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రెండు రోజులు గడిచినా నిందితుడిని పట్టుకోలేదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని పేర్కొన్నారు. అయితే నిందితుడిని అరెస్ట్ చేశామని, పోలీసులను రాజకీయాల్లోకి లాగొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. పోలీసులను వాడుకుని ప్రభుత్వాన్ని నడిపితే.. ప్రతిపక్షంలో ఉండాల్సి వస్తుందని మంత్రి విమర్శలు చేశారు.

## బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మండలి ఆమోదం

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు(బిసి)కు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లుకు బుధవారం శాసనమండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జనగణన సర్వే ఆధారంగా బిసిల జనాబాను గుర్తించి విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ బిల్లును ఇప్పటికే శాసనసభ ఆమోదించిన సంగతి తెలిసిందే.

# దేశంలో క్రైస్తవులకు రక్షణ కరువు..

**తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్**



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ మత పెద్దలు పాస్టర్ ప్రవీణ్ పగడాల, దళిత క్రైస్తవ అడ్వకేట్ ఇజ్రాయల్ హత్యలపై కావాలనే ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల్లో మైనార్టీ నేతలు అడ్వకేట్ ఇజ్రాయిల్, పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేడే రాజీవ్ సాగర్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణాన్ని ఏపీలోని ఎన్డీఏ ప్రభుత్వం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవీణ్ ఒంటి మీద ఎక్కడ యాక్సిడెంట్ గాయాలు కాకుండా ఎవరో హింసించిన విధంగా గాయాలు ఉన్నాయని అయిన కావాలనే అక్కడి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరింస్తుందన్నారు. ఉదయం ఘటన జరిగితే రాత్రి 8.30 వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని వివరించారు. అక్కడి ఎన్డీఏ కూటమి ఎవరీ సంతోషం కోసం క్రైస్తవుల హత్యలను ప్రోత్సాహిస్తున్నారని తెలిపారు. నిష్పాక్షపాతంగా రాజకీయ ఒత్తిడి లేకుండా విచాణ జరగాలని లేదంటే ఏదైనా దర్యాప్తు సంస్థకు ఈ కేసును అప్పగించాలని డిమాండ్ చేశారు. అలాగే దళిత క్రైస్తవుడు అడ్వకేట్ ఇజ్రాయల్ హత్య గావించబడడం బాధాకరమన్నారు. తెలంగాణలో దళిత క్రైస్తవ న్యామవాదికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇజ్రాయల్ హత్యకు గురైతే నిందితుడి ఇంటి దగ్గర బందోబస్తు పెట్టిన రాష్ట్ర సర్కార్ ఇజ్రాయల్ కుటుంబాన్ని మాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

ఎన్డీఏ, కాంగ్రెస్ ప్రభుత్వాలు కావాలనే క్రైస్తవుల మీద దాడులకు దిగుతున్న పట్టించుకోవడంలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఉన్న బీజేపీ ఎజెండానే కొనసాగుతుందని తెలిపారు. దేశంలో క్రైస్తవుల హత్యలు నానాటికి పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలల కాలంలో 120 మంది క్రైస్తవులు చనిపోయారని తెలిపారు. అలాగే ఏపీలో 37 మంది మన తెలంగాణలో 25 మంది హత్యకు గురైయ్యారని వివరించారు. ఈ గణాంకాలు చూస్తుంటే దేశంలో క్రైస్తవులకు రక్షణ ఉందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుందన్నారు. కాబట్టి ఖచ్చితంగా క్రైస్తవ సమాజం ఆలోచన చేయాలని క్రైస్తవులు ఐక్యంగా ఉండి ప్రజల్లో మమేకమైన క్రైస్తవ నాయకులకు అండగా ఉండాలని స్పష్టం చేశారు.

తెలంగాణలో క్రైస్తవుల పట్ల వివక్ష కొనసాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రివర్గంలో క్రైస్తవులకు చోటు లేదని అలాగే కనీసం చట్టసభల్లో కూడా క్రైస్తవులకు ప్రాతినిధ్యం ఇవ్వడం లేదని తెలిపారు. తెలంగాణలో క్రైస్తవులకు సంబంధించి ఉన్న ఒకేఒక ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యే పదవి రద్దుకు ఇప్పటీ సీఎం రేవంత్ రెడ్డి కారణమన్నారు. ఆంగ్లో ఇండియన్ పదవిని రద్దుచేయాలని కేంద్ర ప్రభుత్వానికి పీసీసీ చీఫ్ గా, ఎంపీగా పలుమార్లు ఫిర్యాదు చేసి బీజేపీ ప్రభుత్వంతో తనకు ఉన్న చనువుతో రద్దు చేయించాడని మండిపడ్డారు. దాని తరువాత తెలంగాణలో క్రైస్తవులకు ప్రాతినిధ్యం కరువైందన్నారు. కులగణనలో సైతం క్రైస్తవ జనాభా చూపించలేదు. అసలు కాంగ్రెస్ పార్టీ కావాలనే క్రైస్తవుల జనాభాను దాచిపెడుతుంది. జనాభా ప్రకారం ఎక్కడ క్రిస్టియన్లు రిజర్వేషన్లు రాజకీయ పదవులు అడుగుతారనే భయంతో బీజేపీతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన లెక్కలు చెప్పలేదన్నారు. ఈ మీడియా సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, క్రిస్టియన్ జెఏసీ చైర్మన్ సాల్మోన్ రాజ్, రిటైర్డ్ జడ్జి రాజ్ కుమార్, లీగల్ రైట్ ఆక్టివిస్ట్ జిమ్మీ కిరణ్, క్రిస్టియన్ జెఏసీ ఉపాధ్యక్షులు జి .విద్యా సాగర్, జెఏసీ ట్రెజరరీ కెజె కెన్నెడీ, రోమన్ క్యాథలిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లియో లూయిస్, సీనియర్ హైకోర్టు న్యాయవాది ఎన్ పీ రాజు, దళిత క్రైస్తవ ఐక్య వేదిక నాయకులు మోసెస్, సనత్ నగర్ సీఎస్ఐ నాయకులు ప్రణయ్ కుమార్, ఎంబీ చర్చి కౌన్సిల్ మెంబర్ మోజెస్, జెఏసీ సెక్రెటరీ డి రాజేష్ లతో పాటు పలువురు క్రిస్టియన్ నాయకులు పాల్గొన్నారు.

## సాగునీళ్లు ఆగిపోయాయి.. వ్యవసాయం ఆగమైంది

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవి, హైదరాబాద్**

ప్రజాపాలనలో ప్రగతి అధోగతిగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సాగునీళ్లు ఆగిపోయాయని.. వ్యవసాయం ఆగమైందని పేర్కొన్నారు కాంగ్రెస్ పాలనలో పచ్చని పొలాలు మాయమైపోయాయని కేటీఆర్ అన్నారు. పంట చేలు పశువులకు మేతగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో మాయమైన బోరు బండ్లు.. 15 నెలల కాంగ్రెస్ నిర్లక్ష్య పాలన మూలంగా గ్రామాల్లో సాగునీటి కోసం మళ్లీ బోరు బండ్లు ప్రత్యక్షమయ్యాయని అన్నారు. కేసీఆర్ పాలనలో మిషన్ భగీరథతో ఇంటింటికి అందిన తాగునీళ్లు.. నేడు మళ్లీ తాగునీటి కోసం బోర్లు, బావులు, ట్యాంకర్లను ఆడబిడ్డలు ఆశ్రయిస్తున్నారని చెప్పారు. నాడు ఎండాకాలంలో మత్తళ్లు దుంకిన చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు.. నేడు రైతన్నలపై కక్షగట్టిన కాంగ్రెస్ పాలనలో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు వట్టిపోయాయని, పంటచేలు ఎండుతున్నాయని అన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ పాలన తెచ్చిన కరువు అని మండిపడ్డారు.

## రాజకీయ కమిషన్‌లా విద్యా కమిషన్ వ్యవహారం

- **ఎమ్మెల్సీ కవిత**



**బలగం టీవీ, హైదరాబాద్**

విద్యారంగంపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేయడం ఆ పార్టీ దివాలాకోరుతనాన్ని నిరూపించుకుంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. విద్యారంగంపై కాంగ్రెస్ పార్టీకి చిన్న చూపు ఎందుకని నిలదీశారు. అత్యధికంగా పేద ప్రజల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను మరింత మెరుగుపరచాల్సింది పోయి బీఆర్ఎస్ పార్టీపై దుష్ప్రచారం చేయడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన వెంటనే రాష్ట్రంలో విద్యా వికాసానికి కెసిఆర్ గారు పునాది వేశారని, వందలాది గురుకులాలను, ప్రభుత్వ పాఠశాలలను కొత్తగా తెరిచి లక్షలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దారని తెలిపారు. బుధవారం నాడు శాసనమండలిలో విద్యారంగంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో సీట్లు సాధించేలా తాము గురుకుల విద్యార్థులను తీర్చిదిద్దితే కాంగ్రెస్ ప్రభుత్వం వారిని వల్లకాటికి పంపుతోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గురుకుల విద్యార్థులు ఐఐటీలు, ఐఐఎంలు సహా ప్రఖ్యాత విద్యాసంస్థల్లో సీట్లు సాధించారని గుర్తు చేశారు. ప్రఖ్యాత ఢిల్లీ యూనివర్సిటీకి తాము వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బిడ్డలను పంపితే కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లో 84 మంది బిడ్డలను కాటికి పంపిందన్నారు. పేదతల్లి తన పిల్లలను చదివించుకునేందుకు ఎలా తపన పడుతుందో అలాంటి బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని కేసీఆర్ గారు పరితపించారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా విద్యపై ఖర్చు చేసే విషయంలో ఈ అంశాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ఏర్పడే నాటికి 200 గురుకులాలు ఉంటే తమ ప్రభుత్వం వాటిని వెయ్యికి పెంచిందన్నారు. ఇప్పుడు ఆ గురుకులాలు ఎలా దెబ్బతిన్నాయో అందరికీ తెలుసన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ రాజకీయ కమిషన్ లా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం తీరును తప్పు బట్టే విధంగా విద్యా కమిషన్ ఎలా వ్యాఖ్యానిస్తుందని.. గత తొమ్మిదిన్నరేళ్లలో విద్యా వ్యవస్థ నాశనమైందని కమిషన్ ఎలా చెబుతోందని నిలదీశారు. తెలంగాణ బిడ్డల చదువుకు మంచి బాటలు వేయాలని కమిషన్ అనుకుంటే గత 60 సంవత్సరాల చరిత్రను ప్రస్తావించాలన్నారు. నిజాం హయాంలో తెలంగాణలో అక్షరాస్యత కేవలం నాలుగు శాతమేనని.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో విద్యా వికాసానికి అప్పటి ప్రభుత్వాలు చేసిందేమి లేదన్నారు. కేసీఆర్ గారు సీఎం అయ్యాకే విద్యావ్యవస్థను మెరుగు పరిచేందుకు బలమైన పునాదులు వేశారన్నారు. వ్యవస్థలో లోపాలుంటే విద్యా కమిషన్ ఎత్తి చూపాలి కానీ ఇలా పొలిటికల్ కమిషన్ లా వ్యాఖ్యలు చేయడం ఏమిటని నిలదీశారు. కమిషన్ ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఆ సిఫార్సులను ఎంతమాత్రం పరిగణలోకి తీసుకోలేదని బడ్జెట్ ప్రతిపాదనలతో తేలిపోయిందన్నారు. రాష్ట్రంలోని 632 మండలాల్లో రూ.31 వేల కోట్లతో పబ్లిక్, ఫౌండేషన్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని కమిషన్ సిఫార్సు చేసిందని, మొదటి ఏడాదిలో వంద మండలాల్లో రూ.5 వేల కోట్లతో ఈ స్కూళ్లు నిర్మించాలని సిఫార్సు చేస్తే ప్రభుత్వం బడ్జెట్ లో రూ.వంద కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు.

## 'సుప్రీంకోర్టును అవమానించేలా సీఎం వ్యాఖ్యలు'

**బలగం టీవీ, హైదరాబాద్**


సుప్రీంకోర్టును అవమానించేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టులో విచారణ నడుస్తున్న సమయంలో, రేవంత్ రెడ్డి ఉపఎన్నికలు రావు అని చెప్పడం కరెక్ట్ కాదు అది న్యాయస్థానానికి అవమానం అని పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఎం వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్రంగా స్పందిస్తూ.. పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ హౌజ్‌కు ఇమ్యూనిటీ ఉంది.. ఈ హౌజ్‌లో కోర్టుల గురించి కూడా ఏదైనా మాట్లాడొచ్చు అని ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ పది మంది ఎమ్మెల్యేలు డిస్క్వాలిఫై కారు. అది గతంలో కాలేదు. ఇప్పుడు కూడా కాదు అని సీఎం అంటే.. నేను వెంటనే సుప్రీంకోర్టులో ఉన్న మ్యాటర్‌ని మీరు ఎట్ల మాట్లాడుతారని ప్రశ్నిస్తే.. మాకు ఇమ్యూనిటీ ఉంది.. ఈ సభలో ఏదైనా మాట్లాడొచ్చు అని అన్నారు. అయితే ఈ సందర్భంగా చెబుతున్నాం.. జడ్జి గారి రిమూవల్ గురించి తప్ప సుప్రీంకోర్టు, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న విషయాన్ని సభలో మాట్లాడకూడదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.



## రచయితల చేతుల మీదుగా బహుమతులు అందుకున్న విద్యార్థులు

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారంలో తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్ల, అగ్రహారం, మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల సంయుక్త నిర్వహణలో నిర్వహించారు. సాహిత్య సమాలోచన రెండు రోజుల జాతీయ సదస్సు కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిపేట మాస్టర్ మైండ్స్ స్కూల్ విద్యార్థులు హాసిని 7 వ తరగతి.హన్సిక 6వ తరగతి తమ కవితలను ప్రసంగం చేశారు. దీనిలో భాగంగా కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్, దాశరథి అవార్డు గ్రహీత జూకంటి జగన్నాథం చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. జాతీయ సదస్సులో పాల్గొని అత్యుత్తమ ప్రాథమిక కనబరిచి బహుమతులను అందుకున్న విద్యార్థులను క్లస్టర్ ప్రిన్సిపల్ శ్యామ్, అకాడమిక్ ఇన్చార్జి ప్రవళిక,వ్యాయామ ఉపాధ్యాయుడు దేవరాజు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులు దుబ్బాక సంజీవ్15000, ఎం మమత 60000, మంద రమ్య 21000 లకు అందజేశారు.నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం అని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి,మండల అధ్యక్షుడు ప్రవీణ్ లకు జిల్లా ఫిషరీస్ జనరల్ సెక్రటరీ చెన్నమనేని ప్రశాంత్ లకు ఈ సందర్భంగా లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఆసాని మహిపాల్ రెడ్డి,దుర్గ రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు .




## చలివేంద్రం ప్రారంభం

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండలం మండే పల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ ప్రారంభించారు.వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని బాటసారులు,ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిషరీష్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆసాని మహిపాల్ రెడ్డి,దుర్గ రెడ్డి,చందు,కడారి రామ్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి, గడప నారాయణరెడ్డి,దసరాపు శ్రీధర్ గౌడ్, ముద్దం దేవయ్య గౌడ్, కుంటయ్యా గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**బలగం టీవీ , హైదరాబాద్**

గత ఏడు సెషన్లుగా లాభాలను మూటగట్టుకున్న మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. భారత్ పై టారిఫ్ ల విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఆందోళనతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో, సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 728 పాయింట్లు కోల్పోయి 77,288కి పడిపోయింది. నిఫ్టీ 181 పాయింట్లు నష్టపోయి 23,486 వద్ద స్థిరపడింది.

# బీసీ కులాల స్థితిగతులు తెలుసుకునేందుకు పర్యటన..

### -బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

**బలగం టీవీ ,వేములవాడ**



బీసీ కులాలలోని పిచ్చగుంట్ల, బుడ బుక్కల, దొమ్మరి, తమ్మల కులల స్థితిగతులను తెలుసుకునేందుకు తాము ఇక్కడికి వచ్చామని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు . బుధవారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శం రంగు బాలలక్ష్మి బుధవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ చైర్మెన్ గెస్ట్ హౌస్ ఆవరణలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సోషియో, ఎకనామిక్ కుల గణన సర్వే నిర్వహించి, అసెంబ్లీ లో బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు ఆమోదించిందని అన్నారు . తమ కులం పేరు విద్యాలయాలు, ఉద్యోగ స్థలాల్లో పిలుచు కునేందుకు ఇబ్బంది పడుతున్నామని, ప్రత్యామ్నాయ పేరు ఇవ్వాలని పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి వారు విజ్ఞప్తులు అందజేశారని అన్నారు . వారి కులాల పేరు మార్పు కోసం ఇప్పటికే ఆయా కులాల ప్రతినిధులతో చర్చించామని,విజ్ఞప్తులు అందజేసిన వారి స్థితిగతులు నేరుగా తెలుసుకునేందుకు జిల్లా పర్యటనకు తాము వచ్చామని పేర్కొన్నారు. పరిశీలన అనంతరం ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చేశారు. బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్ రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఐపీఎల్ మ్యాచ్‌లకు టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**బలగం టీవీ , హైదరాబాద్**

హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లు తిలకించే క్రికెట్ అభిమానుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియానికి వచ్చేందుకు గ్రేటర్ పరిధిలోని 24 డిపోల నుంచి 60 ప్రత్యేక బస్సులను ఆపరేట్ చేయనుంది. ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్న తేదీల్లో ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ఉప్పల్ స్టేడియంలో మార్చ్ 27, ఏప్రిల్ 6, 12, 23, మే 5, 10, 20, 21 తేదీల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఘట్‌కేసర్, హయత్ నగర్, ఎల్బీనగర్, ఎన్జీవోస్ కాలనీ, కోఠి, లక్డీకాపూల్, దిల్‌సుఖ్ నగర్, మేడ్చల్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు, మియాపూర్, జేబీఎస్, చార్మినార్, బోయినపల్లి, చాంద్రాయణగుట్ట, మెహిదీపట్నం, బీహెచ్‌ఈఎల్ తదితర ప్రాంతాల నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది.



## కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

**బలగం టీవీ , హైదరాబాద్**

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం సైదాబాద్ సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్‌లో చోటుచేసుకుంది. బాధితుల, పోలీసుల కథనం ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రమావత్ శివ (28) సింగరేణి కాలనీ బాంబే కాలనీలో నివాసముంటున్నాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి కల్లు తాగి వచ్చాడు. అనంతరం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్లుకు బానిస కావడంతో గత కొంతకాలంగా కుటుంబ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడ్డట్లు స్థానికులు పోలీసులు తెలియజేశారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని సెక్టార్ ఎస్ఐ సాయికృష్ణ దర్యాప్తు జరుపుతున్నారు.

# ఏటీఎం చోరీల ముఠా అరెస్టు



**బలగం టీవీ , హైదరాబాద్**

రాజస్థాన్ నుంచి వచ్చి హైదరాబాదులో రెక్కీ నిర్వహించి ఏటీఎంలను కొల్లగొడుతున్న పదిమందీ ఉన్న ముఠాను ఆదిభట్ల రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. రాచకొండ సిపి సుధీర్ బాబు ఆ చోరీలకు సంబంధించి వివరాలను సిపి క్యాంప్ కార్యాలయం ఎల్బీనగర్ లో మీడియా సమావేశంలో వెల్లడించారు. రాజస్థాన్ కు చెందిన రాహుల్ ఖాన్, ముస్తాకిం, సరుకు బషీర్ ఖాన్, సబ్దిన్ ఖాన్, రఫీ ఖాన్, ఈ ఐదుగురు ముఠాలో కీలక సభ్యులు గా ఉన్నారు. వీరికి తోడు జహుల్ బదన్ ఖాన్, వాహిద్ ఖాన్, షకీల్ ఖాన్, పర్వేజ్, మహమ్మద్ సర్ఫరాజ్, సహాయకులుగా పనిచేస్తారు. ఈ క్రమంలో వీరు దేశంలో పలుచోట్ల ఏటీఎంల చోరీలకు పాల్పడుతున్నారు. వీరు ఒరిస్సా, బీహార్ ,తదితర రాష్ట్రాలలో చోరీలకు పాల్పడి జైలు జీవితం అనుభవించి బయటకు వచ్చారు. వీరు నిరుపేద కుటుంబాలకు చెందిన వారు. జల్సాలకు అలవాటు పడి ఈ చోరీలు చేస్తున్నట్లు విచారణ ఒప్పుకున్నారని సిపి తెలిపారు. అదేవిధంగా మరో చోరికి తెలంగాణలోని హైదరాబాదును వీరు ఎంచుకొని నెలరోజులు రిక్కి నిర్వహించారు. ఈ క్రమంలో వీరు రావిరాల లోని ఎస్బిఐ ఎటిఎం ను ఎంచుకున్నారు.

ఈనెల 2న ఉదయం 1 గంటల 55 నిమిషాలకు గ్యాంగ్ లోని ఐదుగురు దుండగులు రావిరాల ఎస్బిఐ బ్యాంక్ బ్రాంచ్ వద్దకు చేరుకొని ఏటీఎంలోని సీసీ కెమెరాలకు నల్లని స్ప్రే చల్లారు. అనంతరం ఏటీఎం చెస్ట్ భాగాన్ని గ్యాస్ కట్టర్ తో కట్ చేసి దానిలోని రూ.29,69,900/-నగదును దోచుకొని వెళ్లారు. అదే రోజు ఉదయం కొర్రె శ్రీవాణి డిప్యూటీ మేనేజర్ ఎస్బిఐ బ్యాంక్ రవిరాల వారు ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సీఐ రాఘవేందర్ రెడ్డి దర్యాప్తు ప్రారంభించారు. ఐదు టీములుగా ఏర్పడిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా నేరానికి ఉపయోగించిన కారు టోల్గేట్ ల వద్ద ఎంటరింగ్, ఎగ్జిట్ ల ఆధారంగా కేసు పురోగతి సాధించింది. దాని ఆధారంగా వీరు రాజస్థాన్ హర్యానా రాష్ట్రాల వారిగా గుర్తించారు. ఆ కారు పటాన్చెరువు కు తరచుగా వస్తుండేదని వారికి రాజస్థాన్ వాసులైన పటాన్చెరువు లో ఉన్న వాహిబ్ ఖాన్, షకీల్ ఇంకా గుర్తించారు. వారిని విచారించగా నేరము కు ఉపయోగించిన కారు రాజస్థాన్ కు చెందిన జాహుల్ ఖాన్ దిగా ఒప్పుకున్నారు. ఈనెల 24న అదేకారులు రాజస్థాన్ నుంచి ఆ ముఠా మళ్ళీ హైదరాబాద్కు వచ్చి కొంగరకలాన్ ఏరియాలో తిరుగుతున్నట్టుగా విశ్వసనీయ సమాచారంతో రాఘవేందర్ రెడ్డి నిగా పెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 25న కొంగరకలాన్ లో ఉన్నారని తెలుసుకున్న రాఘవేందర్ రెడ్డి బృందం వెళ్లి చాకచక్యంగా వారిని పట్టుకున్నారు. అనంతరం వారిని విచారించగా మళ్లీ రాజస్థాన్ నుంచి ఏదైనా ఏటీఎం దొంగలించడానికి నగరానికి వచ్చినట్టు విచారణ ఒప్పుకున్నారు. పదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు పూర్తి నగదును రికవరీ చేసినట్లు సి పి సుధీర్ బాబు పేర్కొన్నారు. వీరు ఇలానే దేశంలో చాలా చోట్ల ఏటీఎం చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. వారి వద్ద నుండి నాలుగు లక్షల నగదు గ్యాస్ సిలిండర్ కట్టర్స్, స్విఫ్ట్ కారు, ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చేదించిన ఆదిభట్ల సిఐ రాఘవేందర్ రెడ్డిని అలాగే మహేశ్వరం డిసిపి సునీత రెడ్డిని సీపీ అభినందించారు.




## సుందర్ జట్టులో లేకపోవడం ఆశ్చర్యపరిచింది

### గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచవ్యాప్తంగా ఆదరణ కలిగిన ఐపీఎల్‌పై గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ఓ కామెంట్ చేశారు. ఐపీఎల్ ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్ జట్టు కూర్పుపై ఆయన మాట్లాడారు. సోమవారం పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఆడలేదు. దాంతో, ఒక అభిమాని ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ పోస్ట్ పెట్టాడు. భారత జట్టులోని 15 మంది ఉత్తమ ఆటగాళ్లలో సుందర్ ఒకడు. అలాంటి ఆటగాడికి గుజరాత్ తుది జట్టులో చోటు దక్కకపోవడం బాధాకరం' అని సదరు అభిమాని పోస్ట్ చేయగా.. దానికి సుందర్ పిచాయ్ స్పందించారు. 'అవును.. వాళ్లు సుందర్‌ను ఎందుకు బెంచ్‌కే పరిమితం చేశారో నాక్కూడా ఆశ్చర్యంగానే ఉంది' అని కామెంట్ చేశారు.

## ఇది క్రికెట్ కాదు.. బ్యాటింగ్ అని పిలవాలి

### ఐపీఎల్‌పై రబడా సంచలన వ్యాఖ్యలు

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐపీఎల్ 2025 సీజన్ సాగుతున్న తీరుపై సౌతాఫ్రికా స్టార్ క్రికెటర్ కగిసో రబడా సెటైర్ వేశాడు. బ్యాటర్లే పూర్తి ఆధిపత్యం చెలాయిస్తుండటంపై తనదైన శైలిలో మండిపడ్డాడు. అసలు ఇది క్రికెట్ అంటారా? అని ప్రశ్నించాడు. ఇది ఏ మాత్రం క్రికెట్ కాదని, ఈ ఆటను బ్యాటింగ్ అని పిలవాలని సెటైర్లు పేల్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో పిచ్‌లు పూర్తిగా ఫ్లాట్‌గా మారిపోతున్నాయి. ప్రతీ మ్యాచ్‌లో భారీ స్కోర్లు నమోదవుతున్నాయి. దాంతో ఆటలో అసలు సిసలు మజా మిస్సవుతోంది. ఇది క్రికెట్ కాదు.. ఈ ఆటను బ్యాటింగ్ అని పిలవచ్చు. హైస్కోరింగ్ గేమ్స్ వల్ల రికార్డులు బ్రేక్ అవుతాయి. కానీ లోస్కోరింగ్ మ్యాచ్‌లు వద్దా? బ్యాట్, బంతికి సమతూకం ఉండాలి. లేకుంటే ఆటలో ఉన్న అందం మిస్సవుతోంది. ప్రతిసారి హైస్కోర్లు లేదా ప్రతిసారి లోస్కోర్ మ్యాచ్‌లు జరిగితే ప్రేక్షకులు కూడా బోర్ కొడుతోంది. బ్యాట్, బంతి మధ్య ఆసక్తికర పోరు ఉంటేనే మ్యాచ్ చూసేందుకు ఆసక్తి పెరుగుతోంది.'అని రబడా చెప్పుకొచ్చాడు. ఈ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న రబడా.. పంజాబ్ కింగ్స్‌తోజరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లలో 41 పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు. ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 11 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

## 2026 మార్చి 26న ప్యారడైజ్

### ఆకట్టుకుంటున్న నాని లుక్

**బలగం టీవీ, హైదరాబాద్**




నేచురల్ స్టార్ నాని తాజాగా 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ది ప్యారడైజ్ అనే మూవీ చేస్తున్నారు. మ్యాడ్ మ్యాక్స్ స్టైల్ షేడ్స్‌తో మిక్స్ చేసిన మాస్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాని పాన్ ఇండియా స్థాయిలో మేకర్స్ తెరకెక్కిస్తున్నారు. ఇటీవల ఈ మూవీ నుంచి 'రా స్టేట్‌మెంట్' పేరుతో ఓ వీడియో రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా విడుదలైన నాని లుక్ పోస్టర్ ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. మిషిన్ గన్ తో, వీరుడిలా కనిపిస్తున్న నాని వర్షాన్ని తట్టుకుని నిలబడి కనిపిస్తున్నాడు. 1980ల కాలాన్ని ఆధారంగా మ్యాడ్ మ్యాక్స్ శైలిలో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా బడ్జెట్ సుమారు 110-120 కోట్లు వరకు ఉండే అవకాశం ఉంది. 2026 మార్చి 26న ఈ చిత్రం రిలీజ్ కానుందని మేకర్స్ ప్రకటించారు. ఇంకా 365 రోజులు అంటూ నాని కొత్త పోస్టర్‌తో ఫ్యాన్స్‌కి పూర్తి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు.

# రాయల్స్‌పై నైట్ రైడర్స్ గెలుపు

**బలగం టీవీ, హైదరాబాద్**



డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ ఈ సీజన్‌లో తొలి విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించి 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. క్వింటన్ డికాక్(61 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 97 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్‌తో కేకేఆర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 151 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్(28 బంతుల్లో 5 ఫోర్లతో 33), యశస్వి జైస్వాల్(24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 29) టాప్ స్కోరర్లుగా నిలిచారు. కేకేఆర్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి(2/17), మొయిన్ అలీ(2/23), హర్షిత్ రాణా(2/36), వైభవ్ అరోరా(2/33) రెండేసి వికెట్లు తీయగా.. స్పెన్సర్ జాన్సన్ ఓ వికెట్ పడగొట్టాడు.



అనంతరం కేకేఆర్ 17.3 ఓవర్లలో 2 వికెట్లకు 153 పరగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. క్వింటన్ డికాక్‌తో పాటు, అంగ్‌క్రిష్ రఘువంశీ(17 బంతుల్లో 2 ఫోర్లతో 22 నాటౌట్) రాణించాడు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో వానిందు హసరంగా ఒక్కడే వికెట్ తీసాడు. లక్ష్యచేధనలో కేకేఆర్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. వికెట్ స్లోగా ఉండటంతో కేకేఆర్ ఓపెనర్లు ఆచితూచి ఆడారు. దాంతో పవర్ ప్లేలో కేకేఆర్ 40 పరుగులే చేసింది.

బ్యాటింగ్ లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన రాజస్థాన్ రాయల్స్ టీమ్ బౌలింగ్ లో కూడా కేకేఆర్ ను అడ్డుకోలేక పోయింది. కేకేఆర్ ఓపెనర్ క్వింటన్ డీ కాక్ మొదటి నుంచి దూకుడుగా ఆడుతూ 36 బంతుల్లో హాఫ్ సెంచరీ కొట్టాడు. ఆ తర్వాత కూడా మరింత దూకుడుగా ఆడుతూ జట్టుకు విజయాన్ని అందించాడు.

అయితే, టార్గెట్ మరింత పెద్దదిగా ఉండివుంటే డీకాక్ తన సెంచరీని పూర్తి చేసేవాడు. అతను 97 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ను ఆడాడు. 61 బంతుల్లో 97లి పరుగుల తన ఇన్నింగ్స్ లో 8 ఫోర్లు, 6 సిక్సర్లు బాదాడు. అతనికి తోడుగా రఘువంశీ 22 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. 17.3 ఓవర్లలో కేకేఆర్ 2 వికెట్లు కోల్పోయి 153 పరుగులతో విజయాన్ని అందుకుంది.

## ఇతిహాస కథలో అల్లు అర్జున్

**బలగం టీవీ, హైదరాబాద్**



అల్లు అర్జున్ త్రివిక్రమ్‌తో సినిమా చేయాల్సిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాపై నిర్మాత నాగవంశీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ 'బన్నీ, త్రివిక్రమ్ కలయికలో మేం చేయబోయే చిత్రం దేశం గర్వించేలా ఉంటుంది. ఇండియన్ సినిమా హిస్టరీలో ఇప్పటిదాకా ఎవరూ టచ్ చేయని పాయింట్ ఇది. మైథాలజీ సబ్జెక్ట్‌తో ఈ సినిమా ఉంటుంది. అయితే.. ఇది రామాయణ, మహాభారతాలకు సంబంధించిన కథ కాదు. ఇది మన ఇతిహాసాల్లో ఎవరికీ తెలియని కొత్త కథ. ఎవ్వరూ చూడని కొత్త పాత్రలో ఇందులో బన్నీ కనిపిస్తారు. పానిండియా స్థాయిలో వందలకోట్ల భారీ బడ్జెట్‌తో సినిమా ఉంటుంది. దీనికి ప్రీప్రొడక్షన్ వర్క్‌కి ఎక్కువ సమయం అవసరం. ప్రస్తుతం త్రివిక్రమ్ ఆ పనిలోనే ఉన్నారు' అని తెలిపారు.

## ఏప్రిల్ 11న సంపూర్ణేష్ బాబు 'సోదరా'

**బలగం టీవీ, హైదరాబాద్**



వైవిధ్యమైన కథాంశాలతో, తనదైన వినోదపూరిత నటనతో ప్రేక్షకులను అలరించే సంపూర్ణేష్ బాబు మరోసారి కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సారి అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో, అన్నదమ్ముల అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న 'సోదరా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ చిత్రంలో సంపూర్ణేష్ బాబుతో పాటు సంజోష్ కూడా ముఖ్యపాత్రలో నటిస్తున్నాడు. సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'సోదరా'. చిత్రీకరణ పూర్తిచేసుకుని, నిర్మాణానంతర పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ఏప్రిల్ 11న థియేటర్స్‌ల్లో విడుదల కాబోతుంది. మన్ మోహన్ మేనం పల్లి దర్శకత్వంలో క్యాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై చంద్ర చగంలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## ఆసక్తికర విషయం చెప్పిన ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్..

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎన్టీఆర్ భార్య లక్ష్మి ప్రణతి సోదరుడు, ఎన్టీఆర్ బామ్మర్దిగా నార్నె నితిన్ ఇప్పుడు మ్యాడ్ స్క్వేర్ సినిమాతో రాబోతున్నాడు. ఎన్టీఆర్ బామ్మర్ది కావడంతో నార్నె నితిన్ ఎక్కడికి వెళ్లినా ఎన్టీఆర్ గురించి ప్రశ్నలు కచ్చితంగా వస్తాయి.మ్యాడ్ స్క్వేర్ ప్రమోషన్స్ లో భాగంగా నార్నేనితిన్ సుమ అడ్డా షోకి వచ్చాడు. షోలో సుమ ఎన్టీఆర్ మీ ఇంటికి పెళ్లి చూపులకు వచ్చినప్పుడు మీతో ఏం మాట్లాడారని అడగ్గా నార్నె నితిన్ సమాధానమిస్తూ.. ఆయన పెళ్లి చూపులకు వచ్చినప్పుడు నన్ను స్కూల్ కి పంపించేశారు. నాకు చెప్పలేదు, నాకు పెళ్లి చూపులు అని తెలీదు కూడా అసలు అని తెలిపారు. అప్పుడు తాను స్కూల్ ఏజ్ అని తెలిపాడు.అలాగే.. హీరో అవుదాం అని చెప్పినప్పుడు ఓకే చెయ్యి కానీ ఇండస్ట్రీలో ఇలాంటి ప్రాబ్లమ్స్ ఉంటాయి అని కూర్చోపెట్టి నీట్ గా చెప్పారు ఎన్టీఆర్ అని తెలిపాడు నార్నె నితిన్. దీంతో నార్నె నితిన్ వ్యాఖ్యలు వైరల్ గా మారాయి.